# గులాబీ పార్టీలోకి చేరికల హోరు

- కొల్లాపూర్, పాన్‌గల్, పెంట్లవెల్లి మండలాల్లో బీఆర్‌ఎస్‌లో 250 మంది విపక్షాల యువకులు
- ఎమ్మెల్యే బీరం, పార్టీ రాష్ట్ర నాయకుడు రంగినేని సమక్షంలో చేరిక


ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరిన కుడికిళ్ల కాంగ్రెస్ కార్యకర్తలు

కొల్లాపూర్/పాన్‌గల్, నవంబర్ 6: తెలంగాణలో జరుగుతున్న అసెంబ్లీ ఎన్నికల్లో మూడోసారి కేసీఆర్ నాయకత్వంలోని ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని, ఇప్పటికే పలు సంస్థలు ఇటీవల నిర్వహించిన సర్వేల్లో బీఆర్‌ఎస్ ప్రభంజనం కొనసాగనున్నదని స్పష్టం చేశాయి.దీంతో తమ ఓటు వృధా కాకూడదని,గెలిచే పార్టీలోకి వివిధ పార్టీల్లోని యువకులు గులాబీ దండులోకి చేరికల హోరు కొనసాగుతూనే ఉంది.సోమవారం ఒక రోజే మూడు మండలాల్లో సుమా రు 250మంది యువకులు,వివిధ పార్టీల కార్యకర్తలు బీఆర్‌ఎస్ అభ్యర్థి,ఎమ్మెల్యే బీరం హర్షవర్దన్‌రెడ్డి,పార్టీ రాష్ట్ర నాయకుడు రంగినేని అభిలాశ్‌రావు సమక్షంలో కారెక్కారు. సీఎం కేసీఆర్ పదేళ్ల పాలనలో 60ఏళ్లలో జరుగని అభివృద్ధి,పదేళ్లలో కనీవిని ఎరుగని రీతిలో సబండవర్గాల ప్రజలకు గడప గడపకు సంక్షేమ పథకాలు అందాయి.అంతే కాకుండా వివిధ రంగాల్లోనూ శాశ్వత అభివృద్ధి నిర్మాణాలు జరిగాయి.ఈ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ హ్యాట్రిక్ విజయంతో బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే మరెన్నో సంక్షేమ పథకాలను అమలుచేయడానికి సీఎం కేసీఆర్ ఎన్నికల మ్యానిఫెస్టోలోని పథకాలను అమలు చేయనున్నారు.దీంతో గెలిచే పార్టీలో ఉంటే ప్రయోజనాలు పొందవచ్చన్న భావంతో వివిధ పార్టీలోని కార్యకర్తలు,నాయకులు బీఆర్‌ఎస్‌లోకి వలసల పరంపర కొనసాగుతుంది.గతంలో 19 ఏళ్లు పాలించిన జూపల్లికృష్ణారావు హయాంలో ఆశించని అభివృద్ధికి నోచుకోకపోవడంతో ప్రజల్లో నిరాసక్తితో ఉన్నారు.ఎమ్మెల్యే బీరం అనతికాలంలో ఎన్నో చెప్పుకోదగిన అభివృద్ధి పనులు జరిగాయి.యువకుడైన బీరం హర్షవర్దన్‌రెడ్డిని మరోమారు ఎమ్మెల్యేగా గెలిపించాలని ప్రజలు ఉవ్విళూరుతున్నారు.దీంతోనే బీఆర్‌ఎస్‌లో చేరికల జోరు సాగుతున్నది.కొల్లాపూర్ మండలం కుడికిళ్ల గ్రామానికి చెందిన కాంగ్రెస్ 50మంది,పాన్‌గల్ మండలంలో తెల్లరాళ్లపల్లితండా,మాధవరావుపేట, మాందాపూర్‌లో 100 మంది, పెంట్లవెల్లి మండలకేంద్రంలో 100మంది యువకులు బీఆర్‌ఎస్‌లో చేరారు.దీంతో కొల్లాపూర్ నియోజకవర్గంలో చేరిక హోరుతో కారు వేగంగా దూసుకెళ్తున్నదని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు.రోజురోజూకి బీఆర్‌ఎస్ బలం పుంజుకుంటుండడంతో విపక్షాల్లో ఆందోళన మొదలైంది.

## కోడేరులో ఇంటింటి ప్రచారం..


కారు గుర్తుకు ఓటేయాలని మహిళ ను కోరుతున్న బీఆర్‌ఎస్ నాయకులు

కోడేరు, నవంబర్ 6: మండల కేంద్రం కోడేరులోని బీసీకాలనీలో సోమవారం బీఆర్‌ఎస్ అభ్యర్థి బీరం హర్షవర్ధన్‌రెడ్డిని బలపరిచి కారు గుర్తుకు ఓటు వేయాలని కోరుతూ బీఆర్‌ఎస్ నాయకులు ఇంటింటికీ ప్రచారం నిర్వహించారు. 2018లో ఎమ్మెల్యేగా ఎన్నికైన వెంటనే మండల కేంద్రానికి తొలిసారిగా వచ్చినప్పుడు కోడేరు ప్రధాన రహదారితో పాటు ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణం అంతా బురదమయంగా ఉందని తెలియజేయడంతో, సొంత డబ్బుతో డస్టు కంకర తెప్పించి బురదలేకుండా చేశారన్నారు. 18ఏండ్లు జూపల్లి కృష్ణారావు ఎమ్మెల్యేగా మంత్రిగా ఉన్నప్పటికీ కనీసం రోడ్డుపై ఒక్క తట్ట మన్ను వేయించలేదన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు పవన్‌రెడ్డి, శ్రీశైలం, తదితరులు పాల్గొన్నారు.

## బీరం విజయానికి కృషి చేయాలి

వీపనగండ్ల, నవంబర్ 6: నియోజకవర్గాన్ని అన్నివిధాలుగా అభివృద్ధి చేసిన కొల్లాపూర్ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి బీరం హర్షవర్ధన్ రెడ్డి విజయం కోసం ప్రతి కార్యకర్త కృషి చేయాలని ఎంపీపీ కమలేశ్వర్ రావు, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు సత్యనారాయణ గౌడ్, రైతుబంధు సమితి మండలాధ్యక్షుడు ముంత మల్లయ్యయాదవ్, సింగిల్‌విండో చైర్మన్ రామన్‌గౌడ్ కోరారు. ప్రతి గ్రామంలో గత పాలకుల నిర్లక్ష్యం వలన అభివృద్ధికి నోచుకోని మండలాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసిన బీరం హర్షవర్ధన్ రెడ్డిని గెలిపించేలా ప్రతి గ్రామంలో చేపట్టిన అభివృద్ధిని ప్రజలకు వివరించాలని కార్యకర్తలకు సూచించారు. కార్యక్రమంలో వీపనగండ్ల ఎంపీటీసీ భాస్కర్ రెడ్డి, గోవర్ధనగిరి సర్పంచ్ చంద్రకళ సురేశ్‌రెడ్డి పాల్గొన్నారు.

## బాధితురాలికి పరామర్శ


గాంధీ దవాఖానలో బాధితురాలిని పరామర్శిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

కొల్లాపూర్, నవంబర్ 6: ప్రమాదవశాత్తు కిందపడి కాలు విరిగి హైదరాబాద్‌లోని గాంధీ దవాఖానలో చికిత్సపొందుతున్న కొల్లాపూర్ మండలం ముక్కిడిగుండానికి చెందిన అంగోతు సాలమ్మను సోమవారం ఆ గ్రామ బీఆర్‌ఎస్ నాయకులు పరామర్శించారు. మాజీ సర్పంచ్ ముచ్చెర్ల వేణుగోపాల్‌యాదవ్, ఎఫ్‌ఆర్సీ కమిటీ చైర్మన్ పాత్లావత్ బాలునాయక్ పరామర్శించి రూ.3వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డితో మాట్లాడి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి ఆర్థిక సాయం మంజూరు చేయిస్తామని బాధితురాలు సాలమ్మకు భరోసా ఇచ్చారు.

## మహాసభ కరపత్రాలు విడుదల

పాన్‌గల్,అక్టోబర్ 6: ఈనెల11న హైదరాబాద్‌లో నిర్వహించబోయే మాదిగల విశ్వరూప మహాసభ కరపత్రాలను సోమవారం మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు లక్ష్మయ్య మాదిగ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టి చట్టబద్ధత కల్పించాలని కోరారు.

# బీరం గెలుపే లక్ష్యంగా పనిచేయాలి


పెద్దకొత్తపల్లిలో కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న గౌరారం వెంకట్‌రెడ్డి

పెద్దకొత్తపల్లి, నవంబర్ 6: ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డిని మరోమారు గెలుపు కోసం బీఆర్‌ఎస్ కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని బీఆర్‌ఎస్ జిల్లా నాయకులు గౌరారం వెంకట్‌రెడ్డి గులాబీ శ్రేణులకు పిలుపునిచ్చారు. సోమవారం మండల కేంద్రంతో పాటు చిన్నకార్పాముల, మారెడుమాన్‌దిన్నె, కల్వకోలు గ్రామాల్లో జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో కొల్లాపూర్ నియోజకవర్గాన్ని 19ఏండ్లుగా ఏకధాటిగా ఎమ్మెల్యేగా, అనేక మంత్రి పదవులు చేసిన జూపల్లి కృష్ణారావు నియోజకవర్గంలో చెప్పుకోదగిన అభివృద్ధి శాశ్వత నిర్మాణాలు లేవని గౌరారం విమర్శించారు. అసమర్థుడు, సమర్థుడి మధ్య జరుగుతున్న ఈ ఎన్నికల పోరులో నిత్యం ప్రజల్లో మమేకమై పనిచేసే బీఆర్‌ఎస్ అభ్యర్థి బీరం హర్షవర్ధన్‌రెడ్డి మంచితనం గుర్తించి, కారుగుర్తుకు ఓటేసి భారీ మెజార్టీతో గెలిపించేందుకు కృషి చేయాలని చెప్పారు. పెద్దకొత్తపల్లి మండలకేంద్రానికి ఎమ్మెల్యేబీరం ప్రభుత్వ జూనియర్ కాలేజీని మంజూరు చేయించి ప్రారంభించారన్నారు. ఎగువ ప్రాంత రైతులకు సాగునీటి కష్టాలను తీర్చేందుకు గాను సీఎం దృష్టికి ఎమ్మెల్యే బీరం తీసుకుపోయి బాచారం హైలెవల్ కెనాల్‌కు రూ.31.60కోట్లతో ప్రాజెక్టును మంజూరు చేయించి, మంత్రి నిరంజన్‌రెడ్డితో కలిసి ఎమ్మెల్యే బీరం శంకుస్థాపన చేశారని పేర్కొన్నారు. రాహుల్‌గాంధీ కొల్లాపూర్ సభలో తెలంగాణలో దొరల పాలనను అంతం చేయాలని మాట్లాడటం విడ్డూరమని, కొల్లాపూర్‌లో కాంగ్రెస్ అభ్యర్థి దొరకాదా అని ప్రశ్నించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ జిల్లా నాయకులు దగడాల సుదర్శన్‌గౌడ్, ప్రతాప్‌రెడ్డి, శ్రీనివాస్‌రావు, కొత్తపేట సింగిల్ విండో చైర్మన్ కట్టా రాజేందర్‌గౌడ్,రైతు సమన్వయ సమితి మండల అధ్యక్షులు నాగరాజు,మాజీ జెడ్పీటీసీ వెంకటయ్య,నాయకులు శ్రీకృష్ణచారి,ఉపసర్పంచ్ మశన్న తదితరులున్నారు.

## బీఆర్‌ఎస్‌మ్యానిఫెస్టో కరపత్రాలు పంపిణీ


1వ వార్డులో ఇంటింటి ప్రచారంలో బీరం బిచ్చమ్మ

కొల్లాపూర్, నవంబర్ 6: అనతికాలంలోనే కొల్లాపూర్ నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లోనూ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి అభివృద్ధి చేశారని, ఆశీర్వదించి రెండోసారి మళ్లీ ఎమ్మెల్యేగా గెలిపించి ఆదరించాలని బీఆర్‌ఎస్ అభ్యర్థి మాతృమూర్తి బీరం బిచ్చమ్మ ఓటర్లను అభ్యర్థించారు. సోమవారం పట్టణంలోని ఒకటో వార్డులో బీఆర్‌ఎస్ అభ్యర్థి బీరం విజయం కోసం, సింగిల్‌విండో చైర్మన్ పెబ్బేటికృష్ణయ్య, ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు తాళ్ల పరుశురాంగౌడ్, కౌన్సిలరు కృష్ణమూర్తి, ఆ వార్డు పార్టీ ఇన్‌చార్జి పసుల సుజాత సతీష్, హర్షన్న యువ సైన్యం, పార్టీ నాయకులతో కలిసి ఆమె ఇంటింటా ప్రచారాన్ని చేపట్టారు. ఇంటింటికీ తిరుగుతూ సీఎం కేసీఆర్ మూడోసారి అధికారంలోకి వస్తే వెంటనే అమలు చేయనున్న సంక్షేమ పథకాల ఎన్నికల మ్యానిఫెస్టో ప్రచార కరపత్రాలను బీరం బిచ్చమ్మ పంపిణీ చేశారు. పట్టణంలోని వార్డులో సీసీ రోడ్లు, సైడ్రైన్లు, వీధిలైట్లు ఇంటింటికీ భగీరథ పథకం, నల్లాల ద్వారా తాగునీటి సరఫరా అందిస్తున్నది దేశంలోనే ఏకైక సర్కారు తెలంగాణ ప్రభుత్వమని ఓటర్లకు వివరించారు. నియోజకవర్గం అభివృద్ధి కోసం పరితపించే యువనాయకుడు, ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డిని కారుగుర్తు కు ఓటేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో 16వ వార్డు బీఆర్‌ఎస్ ఇన్‌చార్జి తమటం వెంకటస్వామిగౌడ్, పార్టీ నాయకులు సుదర్శన్‌గౌడ్, నర్సింహ, బీషన్న ఉన్నారు.

## కొల్లాపూర్‌లో ఒక నామినేషన్

కొల్లాపూర్, నవంబర్ 6: కొల్లాపూర్ అసెంబ్లీ నియోజకవర్గం 85కు సోమవారం ఒక నామినేషన్ దాఖలైంది. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి జూపల్లి కృష్ణారావు తరపున, ప్రతిపాదకుడు, టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి కేతూరి వెంకటేశ్ స్థానిక ఎన్నికల రిటర్నింగ్ అధికారి కుమార్‌దీపక్‌కు అందజేశారు.

# జెట్ స్పీడ్‌తో దూసుకెళ్తున్న బీఆర్‌ఎస్


పాన్‌గల్‌లో ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరుతున్న కాంగ్రెస్ నాయకులు

పాన్‌గల్, నవంబర్ 6: కాంగ్రెస్‌కు ఓటే వేస్తే ఆగమైతమని, బీఆర్‌ఎస్ పాలనలోనే పేదప్రజల జీవితాల్లో వెలుగులు వచ్చినట్లు ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలకేంద్రంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో తెల్లరాళ్లపల్లి తండా, మాధవరావుపల్లి, మాందాపూర్‌కు చెందిన వివిధ పార్టీలకు కార్యకర్తలు, నాయకులు సోమవారం ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. తెల్లరాళ్లపల్లి తాండాకు చెందిన కాంగ్రెస్ నాయకులు రామారావుతోపాటు 50మంది, మాధవరావుపల్లి గ్రామంలో ఉపసర్పంచ్ రావేందర్‌నాయుడు, జిలానితోపాటు మరికొందరు ముఖ్య నాయకులు, మాందాపూర్ గ్రామానికి ఉపసర్పంచ్ బాలరాజుతో పాటు సంజీవ, నరేష్‌సాగర్, రాజారెడ్డి,సత్యశీలారెడ్డి ఆధ్వర్యంలో 100మంది ఇతర పార్టీలకు నాయకులు ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. ఈసందర్భంగా వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు అభిలాశ్‌రావు, ఎంపీపీ శ్రీధర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షులు రాముయాదవ్, రైతు బంధు సమితి మండల కన్వీనర్ వెంకటయ్య నాయుడు, నాయకులు చంద్రశేఖర్‌నాయకులు, రాజేశ్‌రెడ్డి, మధుకుమార్‌రెడ్డి, రమేశ్‌రెడ్డి, హనుమంతురెడ్డి తదితరులు పాల్గొన్నారు.